క్లుప్తంగా

యోగా ఆవశ్యకత తెలుసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: యోగా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన యోగ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీలు శివన్నారాయణ, వాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగు లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

'పాట్' నూతన కార్యవర్గ ఎన్నిక



తెనాలిరూరల్: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి (పాట్) నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం స్థానిక మారిస్‌పేట రాక్ గాస్పెల్ చర్చ్‌లో జరిగింది. తొలుత అసోసియేషన్ సభ్యులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాస్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జాన్‌పాల్ పినపాటి అధ్యక్షతన పాట్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, అధ్యక్షులుగా బిషప్ పాముల పరంజ్యోతి, ఉపాధ్యక్షులుగా బిషప్ సాధు థామస్ జూనియర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘపరుల సంక్షేమం, అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తమ అసోసియేషన్ కృషి చేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ రావూరి విక్టర్ పాల్, రెవరెండ్ సువర్ణ రాజు, రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్, రెవరెండ్ విలియం కేరీ, పాస్టర్లు షద్రక్, షాలెంరాజ్, సురేష్, ఐజక్ పాల్గొన్నారు.

కాల్వలు ప్రతిరోజూ శుభ్రం చేయండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు ఆదేశం



తెనాలిఅర్బన్: కాల్వలను ప్రతిరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. కొత్తపేట, యడ్లలింగయ్య కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో మురుగు నీరు ఎక్కడా నిలబడకుండా చూడాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

రేపటి నుంచి దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



రేపల్లె: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దే రేషన్ సరుకులు పొందాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇకపై ప్రతి నెల రేషన్ దుకాణాల ద్వారానే సరుకులు పొందాల్సి ఉంటుందన్నారు. 1వ తేదీ నుంచి నిర్దేశించిన తేదీలు, సమయాలలో రేషన్ దుకాణాలు తెరచి డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కార్డుదారులు తమ పరిధిలోని దుకాణాలకు వెళ్లి సరుకులు తీసుకోవాలన్నారు. కార్డుదారులను సరుకుల పంపిణీలో ఇబ్బందులకు గురిచేసినా, అవకతవకలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు తమ పరిధిలోని వికలాంగులు, వృద్ధులకు వారి ఇంటికే వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు.

రూ.40 లక్షలతో డ్రైయిన్ల ఆధునికీకరణ

పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ప్రధాన డ్రైయిన్ల ఆధునికీకరణ కోసం రూ.40 లక్షలు నిధులను వెచ్చించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని పాలాద్రి, జంపని కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో చివర వరకు ఉన్న వ్యర్థాలను బయటకు తీయాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం వీటిని బాగు చేస్తున్న ఎందుకు ఇంత స్థాయిలో వ్యర్థాలు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించారు. ఒక ప్రణాళిక ప్రకారం చేస్తే ఇలాంటి పరిస్థితి ఏర్పడదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చేలోపు పట్టణంలోని ప్రధాన కాల్వలను ఆధునీకరించనున్నట్లు ప్రకటించారు. వర్షం పడితే రోడ్లపై నీరు నిలిచే పరిస్థితి తెనాలిలో కనిపించకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గురవయ్య కాలనీలో మంచి నీటి సమస్యను కూడా పరిష్కరిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, జనసేన పార్టీ నాయకులు హరిదాస్ గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, కరేటి వీరయ్య, బండారు రవికాంత్, గుమ్మడి రవీంద్ర, బసవయ్య పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివాజీ స్మారక సమితి సభ్యులు

తెనాలిటౌన్: ఛత్రపతి శివాజీ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని శివాజీ స్మారక సమితి కార్యనిర్వహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని ది-కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సమావేశ మందిరంలో శుక్రవారం శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మైలా హరికృష్ణ మాట్లాడుతూ జూన్ 8వ తేదీ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు సుల్తానాబాద్‌లోని మార్కెట్‌యార్డు వద్ద నుంచిబైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టే దిశగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శివాజీ స్మారక సమితి గౌరవ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిస్తూ మే 25వ తేదీన శివాజీ డిజిటల్ డ్రామా స్ఫూర్తిదాయకంగా ప్రదర్శించినట్లు చెప్పారు. హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో హిందు బంధువులందరూ ఏకం కావాలని పిలుపునిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యర్రంశెట్టి హనుమంతరావు, అంబటి మారుతీరామ్,హస్మత్ ప్రసాద్, పి.శ్రీనివాస్, కఠారి వాసు దేవనాయుడు, ఉలగంటి శ్రీనివాస్, నంద కిషోర్, రమాదేవి, శారద, ఎం.వీరాంజనేయులు, పూర్ణ, సునీల్, నాగార్జున, హరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



బస్టాండ్ సెంటరులో జెండా ఆవిష్కరణ చేసిన సీఐటీయూ నాయకులు, కార్మికులు

రేపల్లె: కార్మిక హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద శుక్రవారం పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండాను సీఐటీయూ నాయకులు యు.రామకృష్ణ ప్రసాద్ ఆవిష్కరించారు. మణిలాల్ మాట్లాడుతూ 1970, మే 30న కలకత్తాలో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. 55 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. నేటి వరకు కార్మికుల హక్కులు, సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించిందన్నారు. భవిష్యత్‌లోను కార్మిక పక్షపాతిగానే సీఐటీయూ పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న లేబర్ కోడ్స్‌తో కార్మికులు అనేక హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం కేవీ లక్ష్మణరావు వై.వాసు పి.విజయ్, చిట్టిబాబు, డి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: ఉద్యోగులు, కార్మికుల సమస్యల కోసం సీఐటీయూ సంఘం ఏర్పాటు చేసి 55 సంవత్సరాలు అయిందని సీఐటీయూ మండల కన్వీనర్ బొనిగల అగస్టీన్ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటరులో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను సీఐటీయూ నాయకులు వేమూరు విజయరాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ 1970 మే 30న కలకత్తా మహాసభలో సీఐటీయూ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఉద్యోగ, కార్మికుల సమస్యలపై నిరంతరం రాజీ లేని పోరాటాలు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రం తెస్తున్న 4 లేబర్ కోడ్‌లకు నిరసనగా జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో సీఐటీయూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వేమూరి యోహాను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



అమర్తలూరు(వేమూరు): యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చని ఎంపీడీవో మారుతీ శేషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామ సచివాలయంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా మాసోత్సవాలు జూన్ 21వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• కుండపోత!



తెనాలిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దాదాపుగా అరగంటకు పైగా కురిసిన వర్షంతో వేర్వేరు పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా శివాజీచౌక్ నుంచి సత్యనారాయణ పార్కు వరకూ ఉన్న రహదారి వర్షపు నీటిలో మునిగి కనిపించింది. – తెనాలి

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్

తెనాలిరూరల్: తెనాలి టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి టీడీపీ నాయకులు అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై ప్రజలు వినతులను అందజేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, మల్లవరపు విజయ్‌కుమార్ ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

మందు బాబులకు జరిమానా

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ప్రధాన రహదారి వెంబడి ఈ నెల 18న మద్యం తాగుతున్న ఐదుగురిని రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గుర్తించి, వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వారిపై భారత న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, రూ. 10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

పోలీసుల థర్డ్ డిగ్రీకి న్యాయవాదుల నిరసన

విధులు బహిష్కరించి నిరసన



కోర్టు ప్రాంగణం బయట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు విచక్షణారహితంగా నడి రోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని నిరసిస్తూ తెనాలిలో న్యాయవాదులు శుక్రవారం తమ విధులను బహిష్కరించారు. జిల్లా బార్ ఫెడరేషన్‌కు పిలుపు మేరకు ఇక్కడి కొత్తపేటలోని కోర్టుల ప్రాంగణం బయట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ యువకులపై దాడి చేసిన టూ టౌన్, త్రీ టౌన్ సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, బాధిత యువకులకు వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టాలను కాదని పోలీసులు ఎవరినీ శిక్షించే అవకాశం లేదని తెలిపారు. పోలీసులు తాము చేసిన పని సమర్థనీయమే అని మానవ హక్కుల సంఘంకు అఫిడవిట్ ఇచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రాజ్యాంగం, చట్టాలను తెలుసుకుని పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంచలనం సృష్టించిన కేసుల్లోని ముద్దాయిలను ఎవరిపైనైనా పోలీసులు ఈ విధంగా విచక్షణా రహితంగా దాడులు చేశారా? అని ప్రశ్నించారు. అగ్రకులాలకు చెందిన నేరస్తులను ఒక రకంగా, దళితులు, బలహీన వర్గాలకు చెందిన వారైతే మరో రకంగా పోలీసులు చూస్తు వర్గ వివక్షకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సీనియర్ న్యాయవాది చింకా సురేష్‌చంద్రయాదవ్ మట్లాడుతూ ఇటీవలి కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెనాలిలో పోలీసుల సమక్షంలోనే రౌడీషీటర్లు దాడులకు పాల్పడుతున్న వీడియోలను ప్రదర్శించి, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మద్ది మల్లికారుజనరావు, పీపీ ఆర్‌వీ సాగర్, పెదపూడి భూషణం, గుమ్మడి రవిరాజ్, పిల్లి రమేష్, కనపర్తి బెన్‌హర్, ఎవ. శ్రీనివాసరావు, మధిర సురేష్, మందపాటి కోటేశ్వరరావు, జిలుగు రామారావు, ఎస్. మునిబాబు, దారా సాంబశివరావు, ఈవూరి నవీన్‌చంద్, జి. బాబురావు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

దేశంలో పౌరులకు రక్షణ కరువైంది

సీపీఎం సీనియర్ నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న ప్రసాద్

తెనాలిఅర్బన్: దేశంలో పౌరులకు రక్షణ కరువైందని సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, తెనాలి కార్యదర్శి కెబి.ప్రసాద్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం దేశ సమగ్రత, సమైక్యత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారని గుర్తు చేశారు. 40 రోజులుదాటినా ఇప్పటి వరకు ఉగ్రవాదుల జాడ కేంద్రం కనుక్కోలేక పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం ఉగ్రవాదులను శిక్షించాలని కోరారు. నిజాయితీతో వ్యవహరించిన మహిళా మిలటరీ అధికారిపై బీజేపీకి చెందిన మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.రవికుమార్, చిన్ని, ఎస్.ఏసోబు, జి.వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, చిన్న గోపాలరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.రాజ్యలక్ష్మి, ఎఎల్ సునీత, ఈశ్వరి, చంద్రకళ, కళ్యాణి, ఎం.సాంబశివరావు, పోతురాజు, సిహెచ్.శేషగిరిరావు, ఎం.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంకు సమాయాన్ని కేటాయించాలి

ఎంపీడీవో శోభారాణి



యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

రేపల్లె: పని భారంతో మానసిక సంఘర్షణకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ యోగ, ధ్యానం వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించాలని ఎంపీడీవో ఎం.శోభారాణి చెప్పారు. పట్టణంలోని పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందికి శుక్రవారం జరిగిన యోగాంధ్ర-2025 శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరటంతో పాటు మానసిక రుగ్మతలు తొలగుతాయన్నారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సచివాలయ ఉద్యోగులు యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: పట్టణాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించటం జరిగిందన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వార్డులలో పారిశుద్ధ్య పరిరక్షణకై నిరంతరం శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఇండ్లలో వచ్చే చెత్తను నిర్ణీత ప్రదేశాలలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలలో పడవేయాలని, లేని పక్షంలో పారిశుద్ధ్య సిబ్బందికి తడ్డి చెత్త- పొడి చెత్త రూపంలో అందించాలన్నారు. దోమల నివారణకై చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైయిన్‌లలో సిల్ట్ తొలగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, స్వచ్ఛ రేపల్లె సాధనకై కృషి చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని 30 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కమిషనర్ సాంబశివరావు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: కోయంబత్తూరులో ఇటీవల జరిగిన అంతర్జాతీయస్థాయి కర్రసాము(సిలంబం) పోటీల్లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ కేవీ సెబాస్టియన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి.హంసినీ మీనాక్షి బంగారు పతకంతో పాటు, వి.వైదిక్ కాంస్య పతకాన్ని సాధించారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో విద్యార్థులు చిన్నతనం నుంచే ఆత్మరక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు కర్రసాము ఉపయోగపడుతుందన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో డాక్టర్ గణేష్ జట్టు విజయం



రేపల్లె: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ టీం క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత 10 రోజుల నుంచి కొల్లూరులో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో పాల్గొన్న చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ ఈవూరి గణేష్ టీమ్ ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచింది. ఇటీవల కృష్ణా జిల్లా ఘంటసాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను గణేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

వేమూరు: పోతుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలా గోపాలరావు(55) మృతి చెందడం జరిగిందని ఎంపీడీవో శ్రీమన్నారాయణ తెలిపారు. తెనాలి రూరల్ కఠెవరం గ్రామానికి చెందిన గోపాలరావు శుక్రవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వేమూరు మండలంలోని పోతుమర్రు గ్రామం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు.